


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 360 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 30 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :360 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 30 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు




- శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్న కాకాణి
- సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న
- నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన

- మిగతా 2లో

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు



- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

- మిగతా 2లో



## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి వారి అకాడమీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించామన్న రవీంద్ర
- రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించామని వెల్లడి
- ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు

- మిగతా 2లో



## గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

### ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్ నాగబాబు

- తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాం ధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు.

- మిగతా 2లో

# ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

### సీఎం చంద్రబాబు ప్రకటన






- ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో వైద్య సేవలు
- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుపత్రులతో,

- మిగతా 2లో

## ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ




పెన్ పవర్ డెస్క్: వైద్య రంగంలో ఏఐ తీసుకొస్తున్న మార్పులు ఇప్పటికే స్పష్టంగా కనిపి స్తున్నాయి. వ్యాధులను గుర్తించడం, రోగి బాగోగులు చూడటం, డ్రగ్స్ మోతాదునీ దాని పనితీరునీ పరిశీలించడం,

- మిగతా 2లో



## సజ్జల చేతిలో జగన్ బందీ..

### నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు
- పార్టీ ప్లీనరీలో తనపై సజ్జల భౌతికంగా దాడి చేసినా జగన్ మౌనంగా ఉన్నారన్న విజయసాయి
- వైసీపీలో ఇప్పుడు జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1 అని తీవ్ర విమర్శలు
- ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజ్యసభ పదవికి, పార్టీకి రాజీనామా చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను

- మిగతా 2లో

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

- ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల ఇంగువ అమ్మకాలపై నిషేధం
- నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేల్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- నమూనాల్లో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- కంపెనీల ముడిసరుకులోనూ నాణ్యత లోపాలు ఉన్నాయని వెల్లడి
- దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు సంస్థలకు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో




## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

### అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం

- దానం రాకముందే లక్కీ డ్రా ప్రారంభించిన అధికారులు
- ప్రోటోకాల్ ప్రారంభించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారన్న దానం
- బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 2లో





## వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

- సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం
- గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు
- అడ్డుకునేందుకు యత్నించిన ఎస్సై నవీన్ కుమార్ కి గాయాలు

- మిగతా 2లో

## ఎంఐఎం నుంచి బహిష్కరణ..

### అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన మజ్లిస్
- సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి డీప్‌ఫేక్ వీడియోలని ఆరోపణ
- తనను, పార్టీని అప్రతిష్టపాలు చేసే కుట్ర అని రహ్మత్ బేగ్ వ్యాఖ్య
- వీడియోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర



- మిగతా 2లో

## హర్మూజ్ సంక్షోభం

### గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం
- పరిష్కారానికి కృషి చేయాలని సభ్య దేశాలకు ఐఎంఓ పిలుపు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

- మొదటి పేజీ తరువాయి

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ. 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- మొదటి పేజీ తరువాయి

కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు.

రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

# ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ

- మొదటి పేజీ తరువాయి

స్కానింగ్ రిపోర్టులను విశ్లేషించడం ఇలా వైద్యరంగంలో ఏఐ వేగంగా విస్తరిస్తోంది. ఇలాంటి వాటి సాయంతో మెదడుకు జరిగిన ఓ శస్త్రచికిత్స విజయవంతమైంది. యూకే కు చెందిన ఆ పేషెంట్ కోలుకొని, ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు.

యూకేకు చెందిన 48 ఏళ్ల రిస్ హిబ్బర్ట్.. ఒకరోజు నడుచుకుంటూ వెళ్తునప్పుడు హఠాత్తుగా స్పృహకోల్పోయారు. తర్వాత మూర్ఛకు లోనయ్యాడు. అప్పటివరకు అతడికి ఎలాంటి అనారోగ్యమూ లేదు. వైద్యులు మెదడుకు స్కానింగ్ తీయగా.. పిట్యూటరీ గ్రంథి సమీపంలో 11 మి.మీ. పరిమాణంలో కణితి ఉందని గుర్తించారు. అది క్యాన్సర్ కాదని తేలినా.. చూపుపై ప్రభావం పడింది. దానిని తొలగించకపోతే.. కంటిచూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని అర్థమైంది. అతను చిన్నదానికే అలసటకు గురయ్యేవాడు.

వైద్యులు అతనికి ఏఐ టెక్నాలజీ సాయంతో శస్త్రచికిత్స నిర్వహించారు. మేలోనే అది జరిగినా.. పేషెంట్ పూర్తిగా కోలుకునేవరకు దాని గురించి బయటపెట్టలేదు. ఎండోస్కోపీ అందించిన లైవ్ సర్జరీ వీడియోను ఏఐ విశ్లేషించడంతో సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించేలా వైద్యులకు వీలుకలిగింది. ఈ వివరాలను వైద్యులు మీడియాకు వెల్లడించడంతో తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది.

# ఎంఐఎం నుంచి బహిష్కరణ..

## అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- మొదటి పేజీ తరువాయి

వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు.

పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు.

ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను

ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

ప్రముఖ మసాలా దినుసుల బ్రాండ్లు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూ×) గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు సంస్థలు విక్రయిస్తున్న కాంపౌండెడ్ ఇంగువ (హింగ్ పౌడర్) నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలడంతో, వాటి అమ్మకాలపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.

మార్కెట్‌లో నిరంతర నిఘా, చట్టపరమైన నమూనాల సేకరణ అనంతరం జరిపిన పరీక్షల్లో ఈ రెండు కంపెనీల ఇంగువ ఉత్పత్తులు నాణ్యత తక్కువగా (సబ్-స్టాండర్డ్) ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో తప్పుడు బ్రాండింగ్ (మిస్‌బ్రాండెడ్) లేదా కల్తీకి గురైనట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

### ఎవరెస్ట్ ఉత్పత్తుల్లో తీవ్ర లోపాలు

ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ విక్రయిస్తున్న ఇంగువ పొడి, దాని వేరియంట్లలో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఒక నమూనాలో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ నిబంధనల ప్రకారం కనీసం 5 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 0% ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. అదేవిధంగా, ఎవరెస్ట్ యెల్లో హింగ్ పౌడర్‌లో 3.29%, బ్లాక్ హింగ్ పౌడర్‌లో 4.4 శాతం మాత్రమే ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో కూడా ఈ కంపెనీకి చెందిన చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ వంటి ఉత్పత్తుల లేబులింగ్‌లో లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తుచేసింది.

### లాల్జీ గోధూ ఇంగువలోనూ అదే పరిస్థితి

లాల్జీ గోధూ కంపెనీకి చెందిన పొడి, గడ్డల రూపంలో ఉన్న ఇంగువ నమూనాలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, ఇంగువ తయారీకి ఉపయోగించే ముడిసరుకులోనూ అధికంగా స్టార్చ్ (పిండి పదార్థం) ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇంగువలో స్టార్చ్ ఒక శాతానికి మించి ఉండకూడదు. మార్కెట్‌లో సేకరించిన పలు బ్యాచ్‌ల నమూనాల్లో ఈ ఉల్లంఘనలు విస్తృతంగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీలు తమ ఇంగువ ఉత్పత్తుల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. తమ ఉత్పత్తుల్లోని లోపాలను సరిదిద్దడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఇకపై కేవలం నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారుచేసి విక్రయించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

- మొదటి పేజీ తరువాయి

ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

# వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సజ్జల చేతిలో జగన్ బందీ..

## నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- మొదటి పేజీ తరువాయి

విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

### సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

### ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

### సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

### వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు.

ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని... రాయలసీమ, నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

# హర్మూజ్ సంక్షోభంగల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది.

ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

# నాణ్యతా ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మించాలి



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ ఆగస్టు 29:** జీకే వీధి మండలం వంచుల పంచాయతీ చామగెడ్డ గ్రామంలో నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు సూచించారు. శనివారం బ్రిడ్జి స్లాబ్ పనులను పరిశీలించిన ఆయన, నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పరమేష్, పందు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై శ్రీనివాస్



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 29:** మండలంలోని దామనాపల్లి పంచాయతీ పరిధిలోని గొడుగు మామిడి, నల్లబెల్లి గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైన ఇళ్లన్నింటినీ వెంటనే గ్రౌండింగ్ చేసి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సెగ్గే సూరిబాబు, పి.చిట్టిపడాల్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల ఆరోగ్య రక్షణ ధ్యేయం

### అరకులో విప్లాత్మక సంజీవని ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు




**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 29:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజలకు అత్యాధునిక నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రతిష్టాత్మక సంజీవని ప్రాజెక్ట్ ను అధికారికంగా ప్రారంభించారు. అల్లూరి సీతారామ జిల్లాలోని అరకు లోయ మండలం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేదికగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ముఖ్యమంత్రి గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ వైద్యరంగంలోనే ఈ సంజీవన ప్రాజెక్ట్ ఒక గేమ్ చేంజర్ కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైద్యరంగంలో ఏఐ విప్లవం అని సాంకేతికను సామాన్యుడికి అందుబాటులోకి తేవడమే మా ప్రభుత్వ లక్ష్యం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ రికార్డులు సహాయంతో రోగులను ముందే గుర్తించి గిరిజన ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తామన్నారు. టాటా ఎండి భాగ్యస్వంతో ఈ టెక్నాలజీని తీసుకొచ్చామన్నారు. డ్రోన్ల ద్వారా బెడ్ షంపిల్స్ రవాణా, ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామంలో ఎన్నో ఉన్నాయి అందుకే అల్లూరి జిల్లా లోని 21 పిహెచ్సి లను సాంకేతికతో అనుసంధానం చేస్తున్నాము అన్నారు రోగుల నుంచి సేకరించిన రక్తం ఇతర వైద్యనములలోను ద్వారా పాడేరులోని ప్రథమ ల్యాబ్ లకు తరలించి త్వరగా రిపోర్టులు వచ్చేలా చేస్తామన్నారు. గిరిజన ప్రాంతంలోని ఆసుపత్రుల ఆధునికరణకు వైద్య సదుపాయాల మెరుగుదలకు మా ప్రభుత్వం 250 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ఏజెన్సీలోని ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్యలను పరిష్కరించి టెలి కన్సిస్టేషన్ ద్వారా పెద్దపెద్ద వైద్యుల సలహాలు ఎక్కడ ప్రజలకు దక్కేల చేస్తాం అన్నారు. కుప్పం, చిత్తూరు, జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా ఈ సంజీవని విజయవంతమైంది . అక్కడ బీపీ షుగర్ వ్యాధులు అదుపులోకి వచ్చాయన్నారు. గిరిజనుల జీవన ఉపాధి గురించి మాట్లాడుతూ అరకు కాపీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండ్ ఇమేజ్ తెచ్చింది మనమే. కాపితో పాటు మిరియాలు సాగును కూడా ప్రోత్సహించి గిరిజన కుటుంబంలో ఆదాయాన్ని పెంచుతామన్నారు. ఈ పర్యటనలు భాగంగా సీఎం చంద్రబాబు ఆర్.కె నగర్ లోని గిరిజన ఇల్లలు ఇంటిని సందర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్లను సందర్శించి అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

# అట్రాసిటీ కేసులపై ఉక్కుపాదం



- పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి
- బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి జిల్లా కలెక్టర్ అబిషిక్త్ కిషోర్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 29 :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అబిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆయన పాల్గొన్నారు.పెండింగ్ కేసులను సర్కిల్, సంవత్సరం, కేసుల వారీగా సమీక్షించిన కలెక్టర్.. విచారణ దశలో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించా రు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సహకారంతో విచారణ పూర్తయిన కేసుల్లో తదుపరి చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తు తం 106 కేసులు విచారణ దశలో, 689 కేసులు ట్రయల్ దశలో ఉన్నాయని తెలిపారు. అధికారులు, పీపీలు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.అవసరమైన బాధితు లకు కుల ధ్రువీకరణ పత్రాలను త్వరగా అందించాలని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి సంబంధిత రాష్ట్రాల నుంచి ధ్రువీక రణ పత్రాలు తెప్పించాలని ఆదేశించారు. 2026లో 42 కేసులకు గాను 40 కేసుల్లో రూ.62.88 లక్షల పరిహారం అం దించామని, రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపా రు. బాధితులకు నిర్ణీత సమయంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సఫాయి కర్మచారుల సమస్యలు పరిష్కరించాలి

సఫాయి కర్మచారుల సంక్షేమం, పునరావాసం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా సఫాయి కర్మచారి మానిటరింగ్ కమిటీ సమావేశంలో పునరావాసం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు.హెచ్‌పీసీఎల్ వంటి సంస్థల సహకారంతో సఫాయి కర్మచారుల కుటుంబాల్లోని యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు ఆర్డీవోల నేతృత్వంలో డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

నగరంలోని పబ్లిక్ టాయిలెట్లకు ప్రధాన రహదారులపై దిశా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, గూగుల్ మ్యాప్‌లో వాటిని ట్యాగ్ చేయాలని సూచించారు. బహిరంగ మూత్ర విసర్జనను నివారించేందుకు రద్దీ ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చీ సూచించారు.

సఫాయి కర్మచారుల ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను వేగం గా పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు. జిల్లాలో మాన్యువల్ స్కావెంజింగ్ లేదని, నిబంధనల ప్రకారం యంత్రా లనే వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో డీసీపీ-1 మణికంఠ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, డీఈఓ ప్రేమ్‌కు మార్, పూర్ణిమాదేవి, పలువురు ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అరకు నియోజకవర్గంలో 'సంజీవని' పథకం ప్రారంభోత్సవం

### వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం

### రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు29:** అరకు నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'సంజీవని' పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల స్వచ్ఛత, కల్మషం లేని మనస్తత్వాలు ఎంతో ప్రత్యేకమైనవని మంత్రి కొనియాడారు. ఈ ప్రాంతంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక అభిమానం ఉందని, అందుకే ఇక్కడి కాఫీని 'అరకు బ్రాండ్' పేరిట విశ్వవ్యాప్తం చేశారని తెలిపారు. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టి గిరిజనుల గౌరవాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లారని గుర్తుచేశారు.

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి 10,032 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)లను మంజూరు చేస్తే, గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కేవలం 3,100 మాత్రమే నిర్మించారని విమర్శించారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం, ప్రధాని ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ల కింద ?1,200 కోట్లతో 4,500 ఆరోగ్య మందిర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు.

ఈ ?1,200 కోట్ల నిధులలో ఏకంగా 20% నిధులు (రూ. 230 కోట్లు) ఒక్క అరకు పార్లమెంట్ నియోజకవర్గానికే కేటాయించినట్లు వెల్లడించారు. దీనికింద అరకు పార్లమెంట్ పరిధిలోనే 435 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, 28 ల్యాబులు, 8 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు.

గిరిజన గ్రామాల నుంచి రక్తం, థైరాయిడ్, కామెర్లు తదితర పరీక్షల శాంపిల్స్‌ను చింతపల్లి, పాడేరు వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా నేరుగా గ్రామాలకే ఆసుపత్రి సేవలందించేందుకు డ్రోన్ సాంకేతికతను అనుసంధానించామని చెప్పారు. డ్రోన్ల ద్వారా శాంపిల్స్ సేకరించి, పరీక్షలు నిర్వహించి, డిజిటల్ రిపోర్టులను నేరుగా గిరిజనుల వాట్సాప్‌కే పంపే దిశగా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు.

పాడేరు మెడికల్ కాలేజీకి గతంలో కేంద్రం ఇచ్చిన నిధులను మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని, ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్ నుంచి అదనపు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మన్యం బిడ్డలు స్టెతస్కోప్ ధరించి డాక్టర్లుగా సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుప్పం, గిద్దలూరు, కర్నూలు జిల్లాల తర్వాత నాల్గవ పైలట్ ప్రాజెక్ట్‌గా అరకు నియోజకవర్గంలోని గంగవరం/పిహెచ్‌సి పరిధిలో సంజీవని పథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ఆధారంగా డేటా ఆధారిత, సాంకేతిక ఆధారిత వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ రూపుదిద్దుకుంటుందదని,

రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, ఇంటి వద్దకే వైద్య సేవలు, క్రమం తప్పకుండా ఫోన్ కాల్స్ ద్వారా వైద్య సలహాలు, అపాయింట్‌మెంట్లు, ఉచిత మందులు పంపిణీ జరుగుతుందన్నారు.

ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితంగా అనియంత్రిత డయాబెటిస్ బాధితుల సంఖ్య 16% కి తగ్గడమే కాకుండా, 56% మంది రక్తపోటు (హైపర్‌టెన్షన్) బాధితుల్లో గణనీయమైన మార్పు వచ్చి బిపి అదుపులోకి వచ్చిందని స్పష్టం చేశారు.

గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం డకోటా వాహనాల స్థానంలో 500 కొత్త బ్రాండ్ న్యూ 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. సకల సౌకర్యాలతో కూడిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్న మా తలరాతలు మారటం లేదు...!



- ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతోమంది అధికారులు వచ్చినా మా తలరాతలు ఇంతేనా...
- కిడ్నీ బాధితురాలికి డోలి మోతతో 11 కిలోమీటర్ల కాలినడకన ఆసుపత్రికి తరలింపు
- రహదారి బురద మాయం, అబ్బులెన్స్ రాక తీవ్ర ఇబ్బందులు

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 29 :** స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా... ఎన్ని ప్రభుత్వాలు మారినా... ఎందరు అధికారులు వచ్చి వెళ్లిన గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. పలు మారుమూల గ్రామాలకు నేటికీ రహదారి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు తరలించేందుకు గ్రామస్తులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గ్రామాలకు కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేక రోగులను మైళ్ళ దూరం డోలిమోతలతో తరలించాల్సిన దుస్థితి నెలకొంటుంది. మండలంలోని అతిమారుమూలననున్న యు.చీడిపాలెం పంచాయితీ మర్రిపాకలు గ్రామానికి చెందిన కొర్రాబు పద్మ అనే గిరిజన మహిళలకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో కుటుంబీకులు ఆమెను సమీప పోలవరం జిల్లా వైరామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేటికీ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో పాటు ఉన్న కాలిబాట సైతం బురదమయంగా మారడంతో గ్రామానికి అంబులెన్స్ రాలేని పరిస్థితిలో పద్మను ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తుల సాయంతో డోలి కట్టి కాలినడకన మోసుకెళ్లారు. గ్రామం నుండి పలకజీడి వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర కాలినడకన డోలిమోతతో తీసుకెళ్లి అక్కడి నుండి అంబులెన్స్ లో వై.రామవరం పీహెచ్సీ కి తరలించారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి తమ గ్రామానికి కనీసం రహదారి సౌకర్యం కల్పించాలని ఈ ప్రాంత ఆదివాసి గిరిజనులు వేడుకొంటున్నారు ఇప్పటికైనా ఉన్నతఅధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మా గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు వేడుకుంటున్నారు.



# పిచ్చాడ లో రీ-సర్వే పనులను పరిశీలించిన జెసి,సబ్ కలెక్టర్.

- రీ-సర్వే పనులను కచ్చితత్వంతో పూర్తి చేయాలి.
- భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా రీ-సర్వే ప్రక్రియ జరగాలని అధికారులకు ఆదేశించారు.
- జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి.



**కురుపాం,ఆగస్టు 29 పెన్ పవర్.** రైతులకు శాశ్వత భూ హక్కు కల్పించే దిశగా జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను శనివారం జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి,పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలసి కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల తీరుతెన్నులను,సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను,సర్వే రికార్డులను జాయింట్ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు.అనంతరం సర్వే పురోగతిపై సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి మాట్లాడుతూ భూ రీ-సర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లకుండా పూర్తి పారదర్శకతతో,కచ్చితత్వంతో పనులు పూర్తి చేయాలన్నారు.సరిహద్దుల వివాదాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో సర్వే టీమ్‌లు,రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిర్దేశిత గడువులోగా రీ-సర్వే పనులను పూర్తి చేసి రైతులందరికీ స్పష్టమైన హక్కు పత్రాలు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.సర్వే ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని,రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని అక్కడికక్కడే నివృత్తి చేయాలని అధికారులను కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్,కురుపాం తహశీల్దార్,మండల సర్వేయర్లు,విలేజ్ సర్వేయర్లు,విఆర్వోలు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచార దినోత్సవంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



**పద్మనాభం, ఆగస్టు 29 (పెన్ పవర్):** ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచార దినోత్సవం సందర్భంగా పద్మనాభం మండలంలోని వెంకటాపురం, రేవిడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దాడిశెట్టి శైలజ సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుతున్న సేవలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా, జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.?

# జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన విజ్ఞాన్ కళాశాల

**కూర్మన్న పాలెం:పెన్ పవర్,ఆగస్టు29** విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం--2026ను ఘనంగా నిర్వహించారు. భారతదేశ ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు క్రీడా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని స్పోర్ట్స్ ట్రైనీ లు సూచించారు. డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్; డా. వి. మధుసూదనరావు, రెక్టర్ శివరామకృష్ణ, డీన్ -- స్టూడెంట్ అఫైర్స్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు ఎంతో ముఖ్యమైనవని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు బృంద స్ఫూర్తి పెంపొందుతాయన్నారు. విజ్ఞాన్ సంస్థల ఫిజికల్ డైరెక్టర్లు రాంబాబు, డా. పి.ఎస్.వి. రమణ, డా. జె. ప్రశాంత్, జి. వంశీకృష్ణ మరియు జె. దీర్ఘతో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (రాజా) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.



విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలి, బృంద స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక మరియు వ్యక్తిత్వ వికాసానికి క్రీడలను ప్రోత్సహించడంలో వీఐఐటీ తన నిబద్ధతను ఈ కార్యక్రమం ద్వారా పునరుద్ఘాటించింది.

# జాబ్ మేళాకు అనూహ్య స్పందన



**గాజువాక :పెన్ పవర్,ఆగస్టు29** :ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాజువాక సమీపం శ్రీనగర్ లోని టీఎస్సార్,టీబీకే కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళాను ఘనంగా నిర్వహించారు. 100 కంపెనీలు, 3 వేల ఉద్యోగాల లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు,ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.నేటి పోటీ ప్రపంచంలో యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమలు, ప్రైవేటు సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ పొందితే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 100కు పైగా కంపెనీలు పాల్గొని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాయి. వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు, ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఉద్యోగాల కోసం గాజువాకతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు.దీంతో జాబ్ మేళా ప్రాంగణం సందడిగా మారింది.యువతకు ఒకే వేదికపై అనేక కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.అర్హత, నైపుణ్యం ఆధారంగా అభ్యర్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసే ప్రక్రియను చేపట్టారు.కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు,కంపెనీల ప్రతినిధులు,స్థానిక నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31న చిన్నగెడ్డలో మీకోసం కార్యక్రమం.



**ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29.** చింతపల్లి మండలం, చిన్న గెడ్డ గ్రామపంచాయతీలో ఈ నెల 31న ( సోమవారం) మీకోసం ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నెలకొన్న వివిధ రకాల సమస్యలను మీకోసం కార్యక్రమంలో పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. పంచాయితీలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందవచ్చును అన్నారు. ఈ కార్యక్రమానికి విధిగా మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావలసినదిగా ఆమె తెలియపరిచారు. అధికారులు ప్రజలు సమన్వయంతో మీకోసం పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆమె కోరారు.

# చెట్టుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 28) :**నర్సీపట్నం మండలం చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పి. ఈశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బి. రాఘవ నాయుడు మాట్లాడుతూ వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన కృషి ఫలితంగానే తెలుగు భాష ప్రజలకు మరింత చేరువైందన్నారు. వ్యవహారిక భాషను ప్రోత్సహించడం ద్వారా సామాన్యులకు విద్యను చేరువ చేయడంలో గిడుగు రామమూర్తి పంతులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ పి. ఈశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి మాతృభాష ఎంతగానో దోహదపడుతుందని, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషిని ప్రతి గ్రామంలోనూ తెలియజేయాలనే ఉద్దేశంతో ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు



విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు బి. నారాయణమూర్తి, ఎన్. రామతులసి, ఫిజికల్ డైరెక్టర్ దేవి, సహ ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు అభినందించారు.

# దేశభాషలందు తెలుగు లెస్స.

- యన్ఆర్ టెక్ హబ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్‌లో తెలుగు భాషా దినోత్సవంలి.
- మన్యం కవి నూనె రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29.**యన్ఆర్ టెక్ హబ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు, మన్యం కవి నూనె రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు, నేటి ఆధునిక కాలంలో తెలుగు భాషా వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు పద్యాలు, కవితలు, ప్రసంగాలు, వ్యాసాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలుగు భాషా వైభవాన్ని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా నూనె రమేష్ మాట్లాడుతూ.. తెలుగు భాష మన సంస్కృతికి, మన అస్తిత్వానికి ప్రతీక. యువతలో తెలుగు భాష పట్ల అభిమానం పెంపొందించడంతో పాటు, నిత్య జీవితంలో తెలుగును విస్తృతంగా ఉపయోగించాలి అని అన్నారు. అంపసయ్య పై అమ్మ బాష అనే కవితను చదివి విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ విద్యార్థులు కొర్రా శైలు, కిలో కళ్యాణి, కిలో నందిని, పాంగి వంశీ, కొల్లి అగర్వాల్, సుర్ల సౌజన్య, సిందిరి శైలు, వంతల సత్యవతి, వంతల శాంతి, పాంగి జ్యోతి, పాంగి గాయత్రి, పాంగి భాను డి ఎస్ ఎస్ గీతమాధురి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్డులు అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం -నల్లూరు




**కూర్మన్నపాలెం:పెన్ పవర్,ఆగస్టు 29** :మహా విశాఖ నగర పాలక సంస్థ 86వ వార్డులో నూతనంగా నిర్మాణం అవుతున్న బీటీ రోడ్లను స్థానిక తెలుగుదేశం నాయకులు పరిశీలించారు. స్థానిక వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బీటీ రోడ్ల నిర్మాణాన్ని 86వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యవర్గం పరిశీలించారు. 86వ వార్డు రాజీవ్ నగర్,మాతృశ్రీ లేఔట్ కాలనీలలో గత 30 ఏళ్లుగా రోడ్ల నిర్మాణ పనులు జరగలేదని, గత కార్పొరేటర్ వార్డుని నిర్లక్ష్యం చేసి వార్డుని శిధిలావస్థకు తీసుకు వచ్చారని ఆరోపించారు. వార్డు కార్యవర్గం 86వ వార్డులో గల రోడ్ల సమస్యలను గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా అతి కొద్ది కాలంలోనే నిర్మాణం పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. రాజీవ్ నగర్, వడ ఫేస్ 2,ఫేస్ 7, మాతృశ్రీ నగర్ లేఅవుట్ లో నూతనంగా బీటీ రోడ్లను సుమారు 2 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నట్లు , వార్డులో మిగిలిన సమస్యలను అతి తక్కువ కాలంలోనే పరిష్కరిస్తున్నట్లు శాసనసభ్యుడు పల్లా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగార్జున, వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య,యూనిట్ ఇంచార్జ్ సాగి శ్రీను, బూత్ కన్వీనర్లు రమణారావు శ్రీనివాస్ కుమార్,గోవింద్ ప్రధాన్, తెలుగు యువత సభ్యులు అలుగు అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన భారతి యు.పి. పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29**: మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి యు.పి. పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

ముందుగా వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, గిడుగు రామమూర్తి చేసిన భాషా సేవలపై ప్రసంగాలు, పద్య పఠనం, వ్యాసరచన తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలుగు భాషను ప్రేమించి, నిత్య జీవితంలో చక్కగా ఉపయోగించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

అనంతరం భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ఉపాధ్యాయులు సూచించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకటేష్ మాట్లాడుతూ, "మాతృభాషపై అభిమానం, క్రీడలపై ఆసక్తి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరం" అని అన్నారు. విద్యార్థుల్లో భాషాభిమానం, దేశభక్తి, క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

## రాజాన సూర్యచంద్ర పిలుపు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 28) :**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నం రామారావుపేటలోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, బలమైన పంచాయతీల్లో పార్టీ పరిస్థితి, నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వీరసూర్యచంద్ర మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ ప్రతి మండలంలోని బలమైన పంచాయతీల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సన్నద్ధమవుతోందన్నారు. పార్టీకి అనుకూలంగా ఉన్న పంచాయతీలను ముందుగానే గుర్తించి, అక్కడ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనే విధంగా గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన సూచించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ బలంగా ఉన్న ప్రతి పంచాయతీలో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

అలాగే సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహించాల్సిన సేవా, సామాజిక కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున నిర్వహించాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్‌బాబు, దేవి, చోద్యం పీఏసీఎస్ డైరెక్టర్ రేగుబల్ల శివ, వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, మాకవరపాలెం పార్టీ ఉపాధ్యక్షుడు నమ్మి కొండలరావు, నర్సీపట్నం న్యాయ విభాగం కన్వీనర్ అలివేణి మంగ, గొలుగొండ మండల ఎస్సీ అధ్యక్షుడు బోయిన చిరంజీవి, గొలుగొండ మండల నాయకుడు లోకారపు అప్పారావు, నాతవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భద్దు సూరిశేఖర్, పాపారావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆగస్టు 31న దామనపల్లి స్వర్ణ సచివాలయంలో పీజీఆర్ఎస్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగష్టు 29:** దామనాపల్లి పంచాయతీ కేంద్రంలోని స్వర్ణ గ్రామ సచివాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు సమర్పించవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

# గిరిజ నులకు పంపిణీ చేసే మొక్కలలో అవకతవకలు నియంత్రించాలి.

- మాకు కేటాయించిన మొక్కలను మాకు సరఫరా చేయండి.
- కట్టు వీధి గ్రామస్తుల వేడుకోలు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29.** గిరిజనులకు పంపిణీ చేస్తున్న మొక్కల పంపిణీలో అవకతవకలు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని బె న్నవరం పంచాయతీ, కట్టు వీధి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామమైన కట్టు వీధి కి ఎన్ ఆర్ జి ఎస్ నుండి 21 మందికి సిల్వర్ ఓక్ మొక్కలు రావడం జరిగిందన్నారు. కానీ మొక్కలు వచ్చిన తమ గ్రామాన్ని కాదని ప్రక్క గ్రామాల వాళ్లకు మొక్కలను అమ్మివేసి ఎన్ఆర్జిఎస్ సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నరన్నారు. ఈ విషయమై టి ఏ, వీఆర్పీ లకు సంప్రదించగా మీ ఇష్టమైన చోట ఫిర్యాదు చేసుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు అన్నారు. దీంతో తాము మండల పరిషత్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్న టి ఏ, వీఆర్పీ లను తొలగించి వేరే వాళ్ళను నియమించవలసిందిగా వారు కోరుతున్నారు. అలాగే మొక్కల పంపిణీ విషయంలో ఏ గిరిజనుడికి అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికి పారదర్శకంగా మొక్కల పంపిణీ జరగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ జోసెఫ్, ఎస్ చిన్నబ్బాయి, ఈ బాలకృష్ణ, వి. సామ్ సన్, ఎం లక్ష్మణరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొయ్యూరు టిడిపి జడ్పిటిసి అభ్యర్థిగా దుచ్చరి లేక గాడి, అనిశెట్టి నా...?







- ఏకతాటిపైకి టిడిపి సీనియర్ నాయకులు
- కార్యకర్తల్లో పెరుగుతున్న జోష్...!

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 29 :**పాడేరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి మంచి రోజులు రానున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. గతంలో నియోజకవర్గంలో పలువురు గ్రూప్ రాజకీయాలు నిర్వహిస్తూ ఉండేవారని కానీ నేడు వాటికి స్వస్తి చెప్తూ అందరం ఒకే తాటిపైకి వెళ్లి నియోజకవర్గంలో టిడిపికి అఖండ విజయం చేకూర్చుదామని నాయకులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ , మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పై పలువురు అసంతృప్తితో ఉంటూ గ్రూపు రాజకీయాలకు తెరలేపి ఎవరి పందాలో వారు మనుగడ కోసం ప్రయత్నాలు కొనసాగించేవారని పలువురు అభిప్రాయం. అయితే రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధిష్టానం నుండి వచ్చిన పిలుపుమేరకు నియోజవర్గంలో ఉన్న టిడిపి నాయకులు అందరూ ఒకే తాటిపైకి వచ్చి పనిచేయాలని నిశ్చయించుకున్నట్లు తెలుస్తోంది.

**ఎస్టీ రిజర్వేషన్ లో జడ్పిటిసి అభ్యర్థిగా దుచ్చరి చిట్టిబాబు?**
**జనరల్ అయితే గాడి శ్రీరామ్మూర్తి, అనిశెట్టి చిరంజీవి?**

పాడేరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విషయంలో ఇప్పటికే కొయ్యూరు మండలంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గిరిజన రిజర్వేషన్ ప్రకారం తో ఏకాభిప్రాయంగా టిడిపి సీనియర్ నాయకులు మాజీ జిసిసి డైరెక్టర్ చింతపల్లి ఏఎంసీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబును జడ్పిటిసి అభ్యర్థిగా ప్రకటించాలని అధిష్టానం పై ఒత్తిడి తెచ్చే ఆలోచనలో టిడిపి అనుచరులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని తెలుస్తుంది. జనరల్ రిజర్వేషన్ లభించినట్లయితే మాజీ జెడ్పిటిసి గాడి శ్రీరామమూర్తి, సీనియర్ నాయకులు అనిశెట్టి చిరంజీవి ఇద్దరిలో ఒకరిని రంగంలోకి దించే ఆలోచనలో మండల తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నిటిపై చర్చించేందుకు రెండు మూడు రోజుల్లో మండలంలో అన్ని గ్రూపు రాజకీయ నాయకులు సమక్షంలో సమావేశం నిర్వహించి చర్చించేందుకు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. ఏది ఏమైనా నియోజకవర్గంలో టిడిపి పూర్వవైభవానికి అన్ని వర్గాలు ఒకే తాటిపైకి వచ్చాయని సమాచారంతో కార్యకర్తలు, ఓటర్లు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలోఏ కార్యకర్త సమస్య కోసం అయినా నాయకుల వద్దకు వెళ్తే మరో నాయకుల ద్వారా ఇబ్బందులు తలెత్తుతాయని ఆలోచనలో ఉండేవారు . అయితే కార్యకర్తలు అభివృద్ధి, అధిష్టానం ఆదేశాలో తెలియదు కానీ నియోజకవర్గంలో నాయకులు అందరూ మూకుమ్మడిగా ఒకే తాటిపైకి రావడం టిడిపి పార్టీకి కలసి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఏరో ఎక్స్‌ప్రెస్ పరుగులు



ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సులను తనిఖీ చేసిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 29 :**భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్న నూతన ఏరో ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సులను విశా ఖపట్నం రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు శనివారం తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణ, సమయపాలన, ప్రయా ణికులకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు.

విశాఖపట్నం ఓల్డ్ గాజువాక నుంచి ఎన్ఏడి మీదుగా ఏ ఎస్ ఆర్-1 రూట్‌లో 10 బస్సులు, ఓల్డ్ గాజువాక నుంచి సింధి యా మీదుగా ఏ ఎస్ ఆర్-2 రూట్‌లో మరో 10 బస్సులు నడుస్తున్నాయని రీజినల్ మేనేజర్ తెలిపారు. రెండు రూట్ల లో కలిపి మొత్తం 20 ఏరో ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సులు భోగా పురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తు న్నాయని పేర్కొన్నారు.నిర్దేశిత సమయపాలన ప్రకారం బస్సులు నడుస్తున్నాయని, ప్రయాణికులు తమ బస్సు ప్రస్తుత స్థానం, గమ్యస్థానం, రాకపోకల వివరాలను ఎప్ప టికప్పుడు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ప్రయాణికులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఎస్ఆర్టీసీ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, విభాగం ద్వారా 20 ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల లైవ్ ట్రాకింగ్‌ను తెలుసుకోవచ్చని సూచించారు. తద్వారా బస్సు ప్రస్తుతం ఎక్కడ ఉంది, తమకు సమీపంలోకి ఎప్పుడు చేరుకుంటుందో తెలుసుకుని ప్రయాణాన్ని సులభతరం చేసుకోవచ్చన్నారు.

అదేవిధంగా ఏపీఎస్ఆర్టీసీ లైవ్ ట్రాక్ వెబ్‌సైట్ ద్వారా ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల టైమ్‌టేబుల్స్, రాకపోకలు, ఇతర వివరా లను తెలుసుకోవచ్చని తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.ఇటీవల పలువురు విశిష్ట అతిథులు ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించి సేవలను పరిశీలించారని, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు విలువైన సూచనలు చేశారని ఆయన తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణ కూడా ఆగస్ట్ 30, 31 తేదీలలో ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించి సేవలను పరిశీలించడంతో పాటు తగిన సూచనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ కోరారు.

# ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**కూటమిలో ప్రాధాన్యత లేకనే వైసీపీలో చేరికలు: గిరి ప్రసాద్**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 29 :** పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజుపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ అన్నారు.జీకే వీధి మండల కేంద్రంలో నిర్వహించిన వైసీపీ ఆత్మీయ సమావేశం విజయవంతం కావడంతో అసూయతో కొందరు రాజకీయ విమర్శలు చేస్తున్నారని తెలిపారు.రాజకీయ విమర్శలు ఆధారాలతో, బాధ్యతాయుతంగా ఉండాలని, పార్టీ నాయకులపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను పరిశీలించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోపణలకు దూరంగా ఉండాలని, ఆరోపణలకు ఆధారాలు ఉంటే సంబంధిత వేదికలపై వెల్లడించాలని కోరారు.కూటమి పార్టీలో సరైన ప్రాధాన్యత, గుర్తింపు లభించకపోవడంతోనే కొందరు నాయకులు వైసీపీలో చేరుతున్నారని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్, మండల ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, పాంగి చంద్రరావు, ముప్పల చిన్నబ్బాయి, లొంజా గణపతి తదితర పంచాయతీల పార్టీ నాయకులు పాల్గొన్నారు

# విచ్చలవిడిగా వదిలేసిన పశువులను గోశాలలకు తరలించాలి.

- నిర్లక్ష్యంగా ఉన్న పశు యజమానులకు జరిమానా విధించాలి లేనిపక్షంలో ఆందోళన తప్పదు.
- డిఎల్ఓ స్టేట్ కమిటీ కార్యదర్శి కవడం కాసులమ్మ డిమాండ్.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29.**అల్లూరి జిల్లా,చింతపల్లి మండల కేంద్రంలో పశువుల యజమానులు తమ పశు వులను రోడ్లపై విచ్చలవిడిగా వదిలేయడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డిఎల్ఓ స్టేట్ కమిటీ కార్యదర్శి కావడం కాసులమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

చింతపల్లి హైవే టీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, జీసీసీ బంక్, సంత బజార్, హాస్పిటల్ ఎదురుగా ఇలా పట్టణం మొత్తం, అలాగే నర్సీపట్నం -పాడేరు ప్రధాన రహదారిపై పశువులు గుంపులుగా రోడ్డుకు అడ్డంగా నిలబడటం, పడుకోవడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న పశువులు కనిపించక వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పశువులను వదిలేసిన యజమానులపై జరిమానా విధించాలని, చింతపల్లి ఎంపీడీవో, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై తిరుగుతున్న పశువులన్నింటినీ గోశాలలకు తరలించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంబంధిత కార్యాలయాల వద్ద డిఎల్ఓ నాయకత్వంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన శ్రేణులు సన్నద్ధం కావాలి



✷ 16 పంచాయతీల్లో పార్టీ బలోపేతంపై విస్తృత సమావేశం

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ ఆగస్టు 29 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులు సమష్టిగా సన్నద్ధం కావాలని అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ పిలుపునిచ్చారు. జీకే వీధి మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు అధ్యక్షతన మండలంలోని 16 పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో శనివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయిలో బలం, ప్రజల్లో ఆదరణ, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్న పంచాయతీల్లో సమర్థులైన అభ్యర్థులను గుర్తించి ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు.ప్రతి పంచాయతీలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జనసేన పార్టీ పోటీ చేసే స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. కూటమి తరపున అధికారికంగా పోటీ చేసే అభ్యర్థి విజయానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభ్యర్థిత్వం దక్కని నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీ, కూటమి నిర్ణయాలను గౌరవిస్తూ ఎన్నికల్లో సహకరించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని నిర్ణయించారు. సమావేశంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి పోత్తూరు విష్ణుమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, సోషల్ మీడియా ప్రతినిధి కొయ్యం ఇమ్మానుయేల్, సంకాడ పంచాయతీ పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు, గడుతూరి పరమేశ్వరరావు,చిక్కుడు అశోక్, రింతాడ పంచాయతీ ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, వనపల ఈశ్వర్, పాంగి శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షిప్‌యార్డ్‌లో విద్యార్థినులకు సాంకేతిక పాఠాలు



**ములగాడ,పెన్ పవర్, ఆగస్టు 29 :** జీవీఎంసీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సెట్ అప్ కార్యక్ర మంలో భాగంగా మల్కాపురం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థినులకు శనివారం హిందు స్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో విద్యా పర్యటన నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ జనరల్ పి.ఎం. సత్యవేణి పర్యవేక్షించారు. హెచ్ ఎస్ ఎల్ అధికారులు విద్యార్థినులకు నౌకా నిర్మాణం, మరమ్మతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నం, సంస్థ చరిత్రపై అవగాహన కల్పించారు. షిప్‌యార్డ్‌లోని కవర్డ్ బిల్డింగ్ డాక్, స్లిప్‌వేలు, భారీ క్రేన్లు, వెల్డింగ్ షాపులను విద్యార్థినులు సందర్శించి నౌకా నిర్మాణంలో ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని ప్రత్యక్షంగా పరిశీలిం చారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణి మాట్లాడుతూ..సెట్ అప్ ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాల తో పాటు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందిస్తున్నామని తెలి పారు. ఇలాంటి పర్యటనలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకునేందుకు దోహదప డతాయని పేర్కొన్నారు.

షిప్‌యార్డ్ సందర్శన తమకు కొత్త అనుభూతిని, సాంకేతిక రంగంపై అవగాహనను కల్పించిందని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, జీవీఎంసీ,హెచ్ ఎస్ ఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణ, సర్టిఫికెట్లు అందజేత




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 29:** డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఆదేశాల మేరకు ఖైదీలలో నైపుణ్యాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రత్యేక మహిళా కారాగారం లో మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణా నిర్వహించినట్లు ప్రత్యేక మహిళా కారాగారం పర్యవేక్షణాధికారిణి సి.హెచ్. వసంతకుమారి తెలిపారు. ఈ మేరకు డా. బి.ఆర్. అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కుల మురళిను సంప్రదించి మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణ అందించాలని కోరమన్నారు. అనంతరం వేసవి కాలంలో కళాశాలకు చెందిన నలుగురు మహిళా లెక్చరర్లు కళ్యాణి, బిందు, పావని, శ్రీదేవి లు ప్రత్యేక మహిళా కారాగారానికి వచ్చి మహిళా ఖైదీలకు కంప్యూటర్ లో శిక్షణ అందించినట్లు తెలిపారు.

ఈ శిక్షణలో ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, ఎంఎస్ ఆఫీస్, పైథాన్, ఇంటర్నెట్, ఈ-మెయిల్, టైపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు పర్యవేక్షణాధికారిణి వసంత కుమారి తెలిపారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 11 మంది మహిళా ఖైదీలకు ప్రత్యేక మహిళా కారాగారంలో సర్టిఫికెట్లను అందజేసినట్లు సి.హెచ్. వసంతకుమారి తెలిపారు.

కంప్యూటర్ నైపుణ్యాలు మహిళా ఖైదీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, విడుదల అనంతరం ఉపాధి అవకాశాలను మెరుగు పరచి, సమాజంలో పునరావాసం పొందేందుకు దోహదపడతాయని ఆమె తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధితో మహిళా ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. విడుదల అనంతరం ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరా భారతి రాయ్, పి. పావని, కె. సుభాషిణి, బి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.ఐ


# నేత్రదానం - మహాదానం

- ✷ కిలగడ కేజీబీవీ పాఠశాలలో 41వ నేత్రదాన పక్షోత్సవాలు.
- ✷ ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నేత్రదానం పక్షోత్సవాలు.
- ✷ వైద్యాధికారిణి రమ్య ప్రభ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 29.** 41వ జాతీయ నేత్రదాన అక్షోత్సవం మండలంలో గల కిలగడ కేజీబీవీ పాఠశాలలో వైద్యఅధికారిణి రమ్య ప్రభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ సౌరప్పడు మాట్లాడుతూ.. జాతీయ అందత్వ నివారణ కార్యక్రమం, 41వ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా కంటి చూపు కోల్పోయి జీవిస్తున్న వారికి చూపు ప్రసాదించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. నేత్రదానం మహాదానం అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్ళుటకు జాతీయ నేత్రదానం పక్షోత్సవాలు ప్రతి ఏటా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వ తారీకు వరకు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. మనిషి మరణంతరం 6 గంటలలోపు కంటిలోనీ కార్నియాను తీసి మరొకరికి అమర్చుటకు నేత్ర దానం అంటారని అన్నారు. ఇందులో భాగంగానే శనివారం కిలగడ కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన కల్పించమన్నారు. పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ పెద్దమీ, హెచ్ వి పి లక్ష్మి, పీఎంఓఓ వి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూద స్థావరంపై నర్సీపట్నం పోలీసుల మెరుపు దాడి



ఆరుగురు అరెస్ట్, 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 28) :** అనకాపల్లి జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచ్ అందించిన సమాచారం మేరకు నర్సీపట్నం టౌన్ పోలీసులు జూద స్థావరంపై దాడి నిర్వహించారు. నర్సీపట్నం టౌన్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి నర్సీపట్నం పరిధిలోని కొత్త బయ్యపురెడ్డిపాలెం శివారులో ఈ దాడి చేపట్టారు. డబ్బులు పణంగా పెట్టి జూదం ఆడుతున్న ప్రదేశంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి, జూదంలో పాల్గొంటున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,05,010 నగదు, 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## బలపం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో దోమతెరలు పంపిణీ.

- ✷ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమతెరలు పంపిణీ.
- ✷ కోరుకొండ వైద్యాధికారి ప్రశాంత్ కుమార్.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 29.** గిరిజన ప్రాంతంలో నెలకొన్న భిన్న వాతావరణ పరిస్థితులకు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున దోమతెరలను పంపిణీ చేస్తున్నట్లు కోరుకొండ పిహెచ్సి డాక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో నెలకొన్న మార్పుల కనుగుణంగా ఏజెన్సీలు రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమతెరలను బలపం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతం కావడం, పాఠశాల ప్రాంగణం చుట్టూ ఎత్తైన కొండలు, చెట్లతో నిండి ఉండడం వలన దోమలు దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు చర్యగా దోమల బారిన నుండి విద్యార్థులు కాపాడుకునేందుకు దోమతెరలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దోమతెరలు వాడడం వలన దోమల వలన సంక్రమించే అనేక వ్యాధి బాధల నుండి తప్పించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను విధిగా వినియోగించుకుంటూ రోగాల బారి నుండి విముక్తిని పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రశాంత్ కుమార్, ఎం పి హెచ్ ఓ కన్నబాబు, హెల్త్ అసిస్టెంట్ వీర్రాజు, ఏఎన్ఎం సోనీ, సిబ్బంది సుమర్ల అప్పారావు, బల్లుల వెంకటరమణ పాల్గొన్నారు.

## పాడేరు నుండి నర్సీపట్నం వరకు వయా వంజరి లంబసింగి మీదుగా బస్సును ప్రారంభించాలి. వైస్.ఎం.పీ.పీ కుడుముల సత్యనారాయణ.



**జి.మాడుగుల.పెన్ పవర్.ఆగస్టు 29.** పాడేరు నుంచి జి.మాడుగుల వంజరి లంబసింగి మీదుగా నర్సీపట్నం వరకు ఆర్టీసీ బస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని జి.మాడుగుల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కుడుముల సత్యనారాయణ కోరారు. ఈ మార్గము జాతీయ రహదారిగా మార్చడం వలన రహదారి పనులు జరగడం వలన. ఆర్టీసీ బస్ సర్వీసులను ఈ మార్గంలో నర్సీపట్నం వరకు నడిపితే జి.మాడుగుల చింతపల్లి కొయ్యూరు గొలుగొండ మండలాలతో పాటు నర్సీపట్నం ఇతర ప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని సమయం వృధా కాకుండా ఉంటుందని ఆయన అన్నారు. ఇటు పాడేరు అటు నర్సీపట్నం డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని దీంతో జి.మాడుగుల మండలంలోని ఆరు పంచాయతీలు అటు చింతపల్లి పంచాయతీలోని మరో ఆరు పంచాయతీలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు సౌకర్యం గా ఉంటుందని ఆయన కోరారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయం ఆలోచించి ఆర్టీసీ బస్ సర్వీసులను నడపాలని ఆయన కోరారు.

## పంచాయతీ సెక్రెటరీ విజయ దేవరాజ్ ఆధ్వర్యంలో శ్రమదానంతో చుట్టుమట్ట గ్రామానికి ఇరువైపులా మొక్కలు నాటుట



**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్టు 29** పంచాయతీ లో చుట్టూమెట్ట గ్రామమునకు వెళ్ళు రోడ్డు ఇరువైపులా (నీడ )మొక్కలు తమ సొంత ఖర్చుతో శ్రమాధానం తో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సెక్రటరీ విజయ దేవరాజు దగ్గరుండి మొక్కలు నాటు కార్యక్రమం ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ మీ గ్రామమునకు ఏ అవసరాలు ఉన్నా మరియు గ్రామపంచాయతీలో ఏ అవసరము వచ్చినా నన్ను సంప్రదించవలసినదిగా మనవి చేయుచున్నానని ఆయన తెలిపారు మరియు రోడ్డుకు రాత్రిపూట వెళ్ళుటకు చీకటిగా ఉన్నందున ప్రతి స్తంభానికి ఒక వీధి లైట్ బల్బ్ లు ఏర్పాటు చేస్తానని ఆయన గ్రామస్తులతో తెలిపారు మరియు పంచాయతీ పరిధిలో చుట్టుమెట్ట గ్రామానికి మరియు జి.మాడుగులకు వాటర్ స్కీమ్ ద్వారా మంచినీరు అందించుచున్న పైప్ మధ్యలో మరమ్మత్తులకు గురై నీరు వృధాగా పోవుచున్నది వాటిని కూడా తదితర సిబ్బందితో మరమ్మత్తులు చర్యలు చేపడతానని ఆయన తెలిపారు మరియు జి.మాడుగుల చుట్టుమేట్ట గ్రామమునకు వెళు ళ మార్గమున జల జీవన్ మిషన్ వాటర్ షెడ్ ఎదురుగా ఉన్న ఇళ్ల నుండి మురికి నీరు మరియు చెడు వ్యర్థాల నీరు రోడ్డు పైకి వెళ్ళటం చూసి సంబంధిత గృహాల వారిని పిలిచి మురికి నీరు చెడు వ్యర్థాల లను సత్వరమే తొలగించి నీరు వెళ్ళుటకు పైప్ లైన్ ఏర్పాటు చేసుకోవాలని లేదా ఇంకుడు గుంత తవ్వుకోవాలని లేదా డ్రైనేజ్ తవ్వించాలని ఆయన వారిని సూచించారు లేనిపక్షంలో మీకు జరిమాన విధించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు మరియు కొన్ని ఆ గృహాల వాళ్లకు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయమే లక్ష్యం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 29 :** గూడెంకొత్తవీధి మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించడం ఖాయమని రింతాడ పంచాయతీ వైసీపీ అధ్యక్షులు ఎస్.రామ్మూర్తి తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు.పార్టీ ఎవరికి అవకాశం కల్పించినా అందరూ సమష్టిగా పనిచేయాలని, అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే అధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించి వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు విజయాన్ని బహుమతిగా అందించాలని కోరారు.

## శారదనికేతన్ లో ఘనంగా తెలుగు భాష దినోత్సవం

- ✷ గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి.
- ✷ శారదనికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ చెండా మత్స్య రాజు.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 29.** తెలుగు భాష దినోత్సవానీ మండల కేంద్రంలోని శారదనికేతన్ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ చెండా మత్స్యరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పాఠశాల అవరణలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..వాడుక భాషా యోధుడు వ్యవహారిక భాషోధ్యామ పితామహులు


పిడుగు గిడుగు జయంతి తెలుగు జాతికి తెలుగు భాషా దినత్సవంగా ఆగస్టు 29యొక్క ప్రాధాన్యత గూర్చి వివరించారు. ప్రముఖ భాషావేత్త, సంఘా సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగస్టు 29తేదీన శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో జన్మించారన్నారు. గిడుగు రామమూర్తి తెలుగు భాష వ్యాప్తి గూర్చి ఎంతో కృషి చేశారని, అందుచేత ప్రతి ఏటా ఆయన జన్మదినం ఆగస్టు 29న తెలుగు భాష దినోత్సవం జరుపు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఎస్ దొన్ను, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యం - జనసేన

- మండల కేంద్రంలో విస్తృతంగా జనసేన మండల బాడీ సమావేశం
- జనసేన మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 29.**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ శ్రేణులకు జనసేన మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల బాడీ సమావేశం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 పంచాయతీలలో పోటీలో నిలబడుతున్న సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు గెలుపే దిశగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలు ప్రజలో తీసుకెళ్లాలని అలాగే అభివృద్ధి, పథకాలు ప్రజలకు అందే విధంగా కృషీ చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 2న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా భారీ ఎత్తున మండల ప్రజలు, జనసైనికులు హాజరై జయప్రదం చేయాలనీ ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కే చందు, మండల ప్రధాన కార్యదర్శి జై సతీష్ కుమార్, పి మురళి, మహిళ నాయకులు కె జ్యోతి, లక్ష్మీ, జి మణి, కార్యదర్శిలు ఎం సింహాద్రి, బి సీతారాం, ఎస్ గంగూలీ, పి నాగేష్, సంయుక్త కార్యదర్శిలు ఎస్ ఉమా శంకర్, కళ్యాణ్, గోవింద్, భగత్ రాం, గోపాల్, కిరణ్, రామ్మూర్తి పాల్గొన్నారు.






# "చరిత్ర మరచిన మహిళలకు అక్షర నివాళి!"





- మరుగునపడిన మహిళలకు చరిత్రలో చోటు!
- బహుజన మహిళల సేవలను వెలుగులోకి తెచ్చిన డా. తెన్నేటి జయరాజు
- 'భారతీయ బహుజన మహిళా ప్రముఖులు' గ్రంథావిష్కరణలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

**విశాఖపట్నం, ఆగస్టు 29 (పెన్ పవర్):**చరిత్రలో గుర్తింపునకు నోచుకోని అనేక మంది బహుజన మహిళల జీవితాలు, సేవలు, విజయాలను వెలుగులోకి తీసుకువచ్చి వారికి చరిత్రలో సముచిత స్థానం కల్పించే ప్రయత్నం అభినందనీయమని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ అన్నారు.

అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం శ్రీమతి తెన్నేటి పద్మావతి మూడో వర్ధంతి స్మారక కార్యక్రమం, 'భారతీయ బహుజన మహిళా ప్రముఖులు' గ్రంథావిష్కరణ, ప్రముఖుల సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం, గుర్తింపు లభించని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా చరిత్రలో మరుగునపడిన మహిళల సేవలు, విజయాలను వెలికితీసి పుస్తక రూపంలో అందించడం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

డా. తెన్నేటి జయరాజు రచించిన 'భారతీయ బహుజన మహిళా ప్రముఖులు' గ్రంథం మహిళల సేవలను సమాజానికి పరిచయం చేయడంలో కీలకమైన ప్రయత్నమని బాగ్చి అన్నారు. మహిళల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను రచయిత తీసుకోవడం అభినందనీయమన్నారు.

కార్యక్రమానికి డా. తెన్నేటి జయరాజు అధ్యక్షత వహించారు. మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. వీరయ్య, విశ్రాంత పోలీస్ సూపరింటెండెంట్ డా. కె. రాజా శిఖామణి, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణ మూర్తి, ఏపీ డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్, ట్రినిటీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ సీఈఓ డా. ఎస్.డి. శామ్యూల్ రాజు, విశ్రాంత సీఏజేఎం టీకేఎస్ఆర్ టాగోర్, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, డా. ఆర్. అరవింద్, బి. కల్యాణరావు, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పుస్తకంపై డా. కె. శ్రీనివాస్, డా. ఎం. శ్రీనివాస్, డా. అదురి శామ్యూల్ జాన్, కాకర రమణ సమీక్షలు నిర్వహించారు. ప్రముఖ బహుజన రచయితలు టీకేఎస్ఆర్ టాగోర్, అట్టాడ అప్పలనాయుడు, వల్లంపాటి సోలమన్ రాజు, చి.జి.వి. ప్రసాద్, డా. పి.వి. రామ్, యార్లగడ్డ హేమంత్ కుమార్, యంత్రపాటి లిల్లీ ప్రియదర్శినిలను ఘనంగా సన్మానించారు.

అనంతరం 'మహిళా సాధికారత -- అనుసంధానం కానివారిని అనుసంధానించడం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖకు చెందిన శ్రీమతి బి. సుజాత ముఖ్య అతిథిగా పాల్గొనగా, డా. తెన్నేటి ప్రగతి, ప్రొఫెసర్ పవిత్ర కొండేటి, ప్రొఫెసర్ సి. ప్రజ్ఞ, ఎన్. స్వర్ణలత, ఎస్కే సలీమా, ఈ. వేమేశ్వరి, లక్ష్మి స్వేరో తదితరులు మహిళా సాధికారతపై ప్రసంగించారు.

శ్రీమతి తెన్నేటి పద్మావతి సేవలను ఈ సందర్భంగా ప్రముఖులు స్మరించుకున్నారు. మహిళల కోసం ఆమె చేసిన రచనలు, సహాయ కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పవిత్ర ప్రగతి సందేశం పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, పారిశ్రామికవేత్తలు, మహిళా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# దోసకాయలపల్లి హాస్టల్ విద్యార్థుల అస్వస్థతపై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో డి ఎం హెచ్ తక్షణ చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఆగస్టు 29:**తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలోని జి ఎస్ హెచ్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో శుక్రవారం గత రాత్రి హర హర శంభో శంభ కొంతమంది విద్యార్థులకు లూజ్ స్టూల్స్, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించాయి. ఈ ఘటనపై దోసకాయలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమాచారం అందించిన వెంటనే జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై, తక్షణమే అవసరమైన వైద్య, పారిశుద్ధ్య, వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టిందనీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. కోమలి తెలిపారు.హాస్టల్‌లో మొత్తం 172 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటివరకు 56 మంది విద్యార్థులకు ఈ లక్షణాలు నమోదయ్యాయన్నారు. బాధిత విద్యార్థులకు దోసకాయలపల్లి పి ఎచ్ సి లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించా మన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందనీ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పి. కోమలి హాస్టల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, తాగునీటి వనరులు, ఆహారం, పారిశుద్ధ్య ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఘటన నేపథ్యంలో నియంత్రణకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నియంత్రణ చర్యల్లో భాగంగా హాస్టల్‌లోని నీటి నిల్వ ట్యాంకులు, సంపులను శుభ్రపరచడం, తాగునీటి వ్యవస్థ నుంచి నీటి నమూనాలను సేకరించి డి పి ఎచ్ ఎల్ ల్యాబ్‌కు కల్చర్ పరీక్షల కోసం పంపించామని తెలియ చేశారు. 28 న మిగిలి ఉన్న ఆహారాన్ని పార వేయించామన్నారు. లక్షణాలు ఉన్న విద్యార్థులను ఇతర విద్యార్థుల నుంచి వేరు చేసి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచామన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు హాస్టల్‌లో 24/7 వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక విద్యార్థినికి వేరే అస్వస్థత ఉండటంతో మెరుగైన వైద్య సేవలు అవసరమై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కి రిఫర్ చేయగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు.

విద్యార్థులు, హాస్టల్ సిబ్బందికి చేతుల పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగం, ఆహార పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుద్ధ్యంపై ఆరోగ్య అవగాహన నిర్వహించా మన్నారు. హాస్టల్ పరిసరాల్లో అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, స్థానిక పంచాయతీ సిబ్బంది, ఎం పి డి ఓ తో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉందని ణవీడయా డా. పి. కోమలి తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ, ఇతర సమన్వయ శాఖల అధికారులు సిబ్బంది తో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన నివారణ, నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# రంగురాళ్ల తవ్వకాలపై నిరంతర నిఘ, తవ్వకాలు సాగిస్తే కఠిన చర్యలు.రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ...






**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు29:**అడ్డతీగల మండలంలొ తపాసికొండ రిజర్వ్ ఫారెస్ట్ లో రంగు రాళ్లు తవ్వకాలు సాగుతున్నట్లు ఒక్కసారిగా బయటపడింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. తపస్సు కొండ తోపాటు మరి ఏ ప్రాంతంలోనైనా రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన తీవ్ర నేరంగా పరిగణించి,కఠిన చర్యలు తీసుకుంటామని అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అధికారుల కళ్ళుగప్పి రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయని, స్థానికంగా ఒక్కసారిగా వార్తలు గుప్పుమన్నాయి. వెంటనే స్పందించిన అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేసరు ,కొన్నిచోట్ల తవ్వకాలు జరుగుతున్న మాటవాస్తవమేనని, తవ్వకాలకు పాల్పడుతున్న వారి వివరాలను సేకరించే పనిలో తమ సిబ్బంది నిమగ్నమై ఉన్నట్లు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా తవ్వకాలు సాగుతున్న ప్రాంతంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా, తవ్వకాలకు పాల్పడుతున్న వారిని, వారి వెనక ఉండి ప్రోత్సహించే దళారులను, పక్క ఆధారాలతో కనిపెట్టి కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని అడ్డతీగల రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన, ప్రోత్సహించిన వారి వివరాలు సేకరించడమే కాకుండా, వారందరినీ మరో రెండు రోజుల్లో అడ్డతీగల ఫారెస్ట్ కార్యాలయానికి రప్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. తవ్వకాలకు పాల్పడిన వారు దొరికితే అటవీ చట్టాల ప్రకారం పలు సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామని, ఈ తవ్వకాల వల్ల దెబ్బతిన్న అటవీ సంపదను జరిమానాలు వేసి రికవరీ చేస్తామని రేంజ్ ఆఫీసర్ హెచ్చరించారు. ఇది ఇలా ఉంటే గతంలో పోలీసు రికార్డుల్లో ఉన్న రంగురాళ్ల వ్యాపారస్తులను గుర్తించి ,స్థానిక పోలీసు శాఖ కౌన్సిలింగ్ నిర్వహించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

# క్రీడలతో విధుల ఒత్తిడికి ఉపశమనం

అధికారుల మధ్య ఉత్సాహభరిత క్రికెట్ పోటీ.. 50 పరుగుల తేడాతో చింతూరు జట్టు విజయం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 29:** నిత్యం ప్రజా పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అధికారిక విధుల్లో ఒత్తిడితో పనిచేసే అధికారులు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు విధుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు.జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రంపచోడవరం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఐటీడీఏ చింతూరు, ఐటీడీఏ రంపచోడవరం అధికారుల మధ్య 12 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. రంపచోడవరం జట్టుకు జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఎస్. ప్రశాంత్ కుమార్, డీఎఫ్ఓ శివకుమార్ గంగాల్ తదితరులు ప్రాతినిధ్యం వహించగా, చింతూరు జట్టుకు కలెక్టర్ కె. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తదితరులు ప్రాతినిధ్యం వహించారు.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన చింతూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 134 పరుగులు చేసింది. తరుణ్ 59 పరుగులతో రాణించగా, కలెక్టర్ దినేష్ కుమార్ 29 పరుగులు సాధించారు. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రంపచోడవరం జట్టు 12 ఓవర్లలో 84 పరుగులకే పరిమితమైంది. దీంతో చింతూరు ఐటీడీఏ జట్టు 50 పరుగుల తేడాతో విజయం సాధించింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా అధికారుల మధ్య స్నేహభావం, సమన్వయం, పరస్పర సహకారం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కె. పోతురాజు, కోచ్ శివాజీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్స్ కాలేజ్లో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగ మేళా









**యువత భవిష్యత్తుకు మరో ముందడుగు**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 29.** తాడేపల్లిగూడెం ఉమెన్స్ కాలేజ్లో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగ మేళాలో ప్రభుత్వ విప్ మరియు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యమే విజయానికి పునాది. ప్రతి విద్యార్థి, ప్రతి గ్రాడ్యుయేట్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఉద్యోగ మేళాలో పాల్గొన్న అన్ని కంపెనీల ఇంటర్వ్యూలకు ధైర్యంగా హాజరై, మీ ప్రతిభను ప్రదర్శించండి. ప్రతి ఇంటర్వ్యూ ఒక కొత్త అవకాశం, ప్రతి అవకాశం మీ భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి... విజయం మీదే.”

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారిని తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యం. ఈ ఉద్యోగ మేళా ద్వారా వందలాది మంది యువత తమ కెరీర్కు తొలి అడుగు వేయాలని ఆకాంక్షిస్తూ...అవకాశాన్ని అందిపుచ్చుకోండి... మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోండి అని అన్నారు.

## వేమన శతకం పద్యాలు ఆలపించిన ఉషోదయ విద్యార్థులు





**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 29:** ఉంగుటూరు మండలం నారాయణపురం ఉషోదయ హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం “ఏకాదశ సహస్ర గళార్చన -- వేమన శతకం” కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాషపై పట్టు పెంపొందించడంతో పాటు మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో మాతృభాషా పరిరక్షణ సేవా సమితి, ప్రగతి భారతం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు.

ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో 100 మంది విద్యార్థులతో వేమన శతక పద్యాలను సామూహికంగా ఆలపించారు. నారాయణపురం ఉషోదయ హైస్కూలులో ప్రిన్సిపాల్ గుణ్ణం బుల్లెబ్బాయి, తెలుగు ఉపాధ్యాయిని రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు వేమన శతక పద్యాలను ఆలపించారు.

ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సైతం ఆసక్తిగా తెలుగు పద్యాలను ఆలపించడం పట్ల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు. మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.

## బాదంపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలలో నో బ్యాగ్ డే



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 29**: ఉంగుటూరు మండలం బాదంపూడి మోడల్ ప్రైమరీ పాఠశాల నెం.1లో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు అల్లు శ్రీను ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చిత్రలేఖనం, ఇల్లు మోడల్, రాఖీలు, గోడ గడియారం తదితర వస్తువులను సృజనాత్మకంగా తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయురాలు ఎం. అరుణకుమారి విద్యార్థులతో అగ్గిపుల్లలను ఉపయోగించి వివిధ ఆకారాలను తయారు చేయించారు. అనంతరం విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అల్లు శ్రీను మాట్లాడుతూ నో బ్యాగ్ డే ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, ఆసక్తిని పెంపొందించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ సృజనాత్మక, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమగ్రంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.ం

# డైమండ్స్ లయన్స్ క్లబ్ జాతీయ క్రీడా దినోత్సవం తెలుగు భాషా దినోత్సవం వేడుకలు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 28.** తెలుగు భాషా అభివృద్ధి జరగక పోతే తెలుగు వైభవం కనుమరుగయ్యే పరిస్థితి వస్తుంది అని లయన్స్ జిల్లా 316 జి రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు

డైమండ్స్ లయన్స్ డైరెక్టర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక గుణ్ణం ఫంక్షన్ ప్రాంగణంలోను మోదుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోను తెలుగు భాషా దినోత్సవం. జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిపారు గిడుగు రామూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా తెలుగు భాషకు ఆయన అందించిన సేవలు స్మృతి చేసుకుంటూ నివాళులు అర్పించి మాట్లాడుతూ తెలుగు ను తల్లి తండ్రులు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సాహించాలని నిత్య వ్యవహారం తెలుగులో మాట్లాడాలని అన్నారు అలానేజాతీయ క్రీడా దినోత్సవం సందర్బంగా ఇటీవల జాతీయ క్రీడాలకు ఎంపిక ఐన విద్యార్థు

లను అభినందించారు. విద్యార్థుల తో క్రీడలు ఆడించారు తెలుగు భాష కు ఊపిరి పోసిన గిడుగు రామూర్తి పంతులు తదితరులు పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు అమరావతి ఛాంపియన్ 2026 యోగా స్టేట్ ఛాంపియన్ షిప్ లో పాల్గొన్న విద్యార్థుల ను అభినందనలు అందించారుఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు స్కూల్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి

ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి








**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 29 :**విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ కె.హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యానచంద్ చిత్రపటానికి పులమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్బంగా డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని చెప్పారు. క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం వంటి శారీరక కార్యకలాపాలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతోపాటు ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వివరించారు. డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి దేశానికి, విద్యాసంస్థకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్యులు శీనివాసన్ వ్యవహరించారు. వివిధ క్రీడా పోటీల్లోఅద్భుత ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రాంగణంలోని పరిపాలనా భవనం నుంచి ఏపీ నిట్ తూర్పు ముఖద్వారం వరకు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సాస్ సహాయకులు కె.వీర వెంకట సాయిరాం ప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకనీ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ శ్రీనివాస్.




**అడ్డతీగల ,పెన్ పవర్, ఆగస్టు 29:** అడ్డతీగల మండలం ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు ఆన్లైన్ అటెండెన్స్ ఉదయం 9.00 గంటలకు ఖచ్చితంగా పూర్తి కావాలని అలాగే సాయంత్రం కూడా ఆన్లైన్లో హాజరు వెయ్యాలని ఎంఈఓ శ్రీనివాస్ ఆదేశించారు. విద్యార్థుల ఆన్లైన్ అటెండెన్స్ కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని, ఉపాధ్యాయుల హాజరు మరియు పనితీరు పరిశీలించడం జరిగినది అనే ఆయన తెలిపారు. మధ్యాహ్నం భోజనం పథకం మెనూ పరిశీలించరూ ,మెనూ సక్రమంగా నిర్వహిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుడు ని అభినందించరు .మెనూ కు సంబంధించి కోడిగుడ్లు, చిక్కి ,రాగి పౌడర్, బియ్యం వదలైన వస్తువులను పరిశీలించి ,సక్రమంగా విద్యార్థులకు ఇవ్వాలని ఎంఈఓ ఆదేశించారు. ఇంప్లిమెంట్ ఏజెన్సీ కి మెనూ సరఫరాలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు కే. గంగరాజు పాల్గొన్నారు.

## ఆచంటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ





**పెన్ పవర్ ఆచంట, ఆగస్టు 29,** ఆచంటనియోజకవర్గం.స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ. ఆధ్వర్యంలో ఆచంట సెంటర్లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్నిఆవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ.మీడియతో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.ఎన్టీఆర్ సేవలను, ఆయన ప్రజా సంక్షేమ పాలనను నేతలు కొనియాడారు.తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్.

పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ప్రారంభించిన అన్న క్యాంటీన్లు ఎంతోమందికి అండగా నిలిచాయని తెలిపారు.అయితే గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తొలగించి పేదలకు అన్యాయం చేసిందని విమర్శించారు.తమిళనాడులో ప్రభుత్వాలు మారినా అమ్మ క్యాంటీన్లు కొనసాగుతున్నాయని, పేదలకు తక్కువ ధరకే ఆహారం అందిస్తున్నాయని శ్రీనివాసవర్మ తెలిపారు.ఆంధ్రప్రదేశ్లోనూ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదలకు అండగా నిలిచామని చెప్పారు. గత పాలనపై ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో ూ××జ చైర్మన్ ఎం. రామరాజు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com